పరువుకోసం
కొడుక్కి
ఆపరేషన్
చేయించాలని ఆ తండ్రి
ఎందుకనుకున్నాడు?

యం.ఉమామహేశ్వర
రావు
కథ

# నిర్ణయం

**అ**తని నోటివెంటబడి-వచ్చిన ఆ మాటల్ని విన్న వెంటనే ఆశ్చర్యంతో మాటలు రాలేదునాకు. ఆ సమయంలో నన్ను గమనిస్తున్న వారెవరైనా, ఆ మనిషి తన మాటలతో నన్ను అచేతనుణ్ణి చేసేశాడని అనుకోవచ్చును.

ఊరుగాని ఊరు... రాష్ట్రంగాని రాష్ట్రం... భాషగాని భాష... అదీగాక, అక్కడ మాట్లాడుకుంటున్నది మేం ముగ్గురమే...

ఒకరు అతను.

అతనంటే... నలభై సంవత్సరాల రంగరాజు.

రెండో మనిషిని నేను...

ఇక మూడోమనిషి విషయానికొస్తే, నిజానికి పెద్దవాడేమీగాదు. ఓ ఎనిమిదేళ్ల కుర్రాడు... వాడిపేరు వాసు.

అదిగో ఆ వాసు గురించే మా ఆందోళన. వారం రోజులుగా, నేనూ, రంగరాజూ పడుతున్న బాధలు వాసుకు అర్థంగావు. నిజానికి అతనికీ మా మాటలు అర్థం అయితే??...

మేం పొందుతున్న ఆవేదన అతని అంతరాంతరాల్లోకి పోయి, అసలు సంగతి తెలిస్తే??...

"నమస్కారం బాబూ!" ఎంతో వినయంగా నా ముందుకొచ్చి నమస్కారం పెడుతున్న రంగరాజును చూసి ఆశ్చర్యపోయాను.

వయస్సులో నాకంటే పెద్దవాడు రంగరాజు. అడపాదడపా ఎదురౌతుంటే నమస్కరించుకోవడం తప్ప పెద్దగా



పరిచయం లేదు నాకు. ప్రతినమస్కారం చేసి కూచోమన్నాను. కూర్చోలేదతను. నించునే వున్నాడు. రంగరాజు ముఖంలో దైన్యం గోచరిస్తోంది. కళ్లో ఏవేవో నీలినీడలు ఏదో బలమైన కారణం ఉండి ఉండే రంగరాజు నా దగ్గరకు వచ్చేడన్నది నిజం. మరి ఏమిటా కారణం?

అదే అడిగాను మామూలుగా.

కాని ఎప్పుడూ ఊహించని జవాబు వచ్చింది రంగరాజు నుంచి.

మాటల్లేవా జవాబులో... దుఃఖం గూడుకట్టుకుని ఉన్నది. అంతవరకు అతని అంతరాంతరాల్లో దాగిన కన్నీటి తరంగాలు ఉధృతంగా పైకుబికేయి.

ఉద్విగ్న హృదయభారాన్ని కన్నీటిద్వారా బయటపెట్టుకున్న అతని గొంతు పలికిందొక్కసారిగా.

నిశ్చలకాశంలో గులకరాయి రేపిన తరంగ ధ్వనిలా.

హిమవన్నగంనుంచి క్రిందికి దొర్లుతూ జారిన మంచు శకలంలా, అతని గుండె ఒణికిందాసమయంలో...

"నిజమా??"... ఆశ్చర్యపోతూ అన్నాన్నేను.

"అవునుబాబూ!! నిజం. ఇక్కడ పెద్దాసుపత్రిలో చూపించేను. ఆ తరువాత నిజాం ఆర్థోపెడిక్స్‌లో చూపించేను. అందరూ ఒప్పుకున్నారు. కాని చేసే ఆ ఆపరేషన్ ఏదో వెంటనే చేసి, వాకొడుకును నాకు దక్కించడానికి ఎవరూ ముందుకు రావడంలేదు నలుగురు ఆడపిల్లల తరువాత పుట్టిన మగనలుసు. వాడిని ఎలా బ్రతికించుకోవాలా అర్థం కాలేదు."

తన రెండు చేతుల మధ్యా ముఖాన్ని ఉంచుకుని రోదించసాగాడు రంగరాజు.

నిశ్శబ్దం మా మధ్య... క్షణాలు నిముషాలుగా గడిచిపోతున్నాయి. మళ్లీ రంగరాజే అన్నాడు.

మద్రాసు తీసుకెళ్దాం అని అనుకుంటున్నాను బాబూ!!

అక్కడ రైల్వే హాస్పిటల్‌లో ఆపరేషన్లు బాగా చేస్తున్నారని విన్నాను. బాబూ!... నువ్వు చిన్నవాడివైనా చేతులెత్తి నీకు దండం పెడతాను. నాతో పాటు తోడుగా మద్రాస్ రాగలవా?? ఏ ఖర్చంతా భరించేందుకు సిద్ధంగా ఉన్నాను."

చటాల్న రెండు చేతుల్నీ పట్టుకున్నాడు రంగరాజు. నా గుండెల్లో జాలిపూలు పూస్తోంది.

రాళ్లు సైతం కరిగి నీరైపోయేలా దుఃఖిస్తున్నాడు రంగరాజు.

నాలోనూ చిన్నగా కంపన మొదలైంది.

ఏదో సైకలాజికల్ ఫీవర్...

నిల్చున్న చోటులోనే కరిగి నీరైపోతున్న భావన...

గుండెల్లో ఏదో ఆత్రం... తొట్రుపాటు ...

రంగరాజు నా ముఖంకేసే చూడసాగేడు. అతని కళ్లల్లో ఆశ. అతని మనస్సులో సందేహ ఛాయలు పొడచూపుతున్నా... తనను తనే ధైర్యం చెప్పుకుంటున్నట్లుగా ఇన్సిడెంటల్ మూమెంట్స్...

నిముషంలో తేరుకున్నాను.

"సరే!... రంగరాజుగారూ!... మీతో పాటుగా తోడుగా నేనూ మదరాస్ రావడానికి సిద్ధమే... వెళ్లి ఆ టిక్కెట్లు వగైరాల కార్యక్రమాలు చూడండి" నిజం చెప్పాలంటే ఆ పరిస్థితుల్లో, నా స్థానంలో ఎవరున్నా సరే, అవుననక తప్పదు. ఆ ఘడియ అలాటిది...

రంగరాజు ముఖంలో కోటిదీపాలు వెలిగిన కాంతి.

వేలకొద్దీ కాంతి కెరటాలు ఉవ్వెత్తున లేచి సరాసరి నన్ను చుట్టుముట్టినట్లయింది. కనురెప్ప మూసి తెరచేలోగా నన్ను బలంగా కౌగలించుకుని బిగ్గరగా... ఏడ్చేసాడు రంగరాజు.

అతని కళ్లు వర్షిస్తుంటే విస్మయంగా చూడ్డం నావంతయింది. అవి కన్నీళ్లుగావు. అతన్లోని ఆశాదీపాల్ని వెలిగించిన చమురు బిందువులు అవి...

అతని గుండెలను దాటుకుని బయల్పడిన ఝరీ ప్రవాహాలు.

* * *

ఆ గది బయట వెయిటింగ్ హాల్లో పొడవుగా వున్న ఓ చెక్క బెంచీ మీద నేమా, రంగరాజూ, అతని ప్రక్కగా రంగరాజు కొడుకు వాసూ కూర్చుని లోపలకు చూస్తూ వున్నాము.

వాసు తనలోతనే ఏదో చిన్న పాట పాడుకుంటూ అటూ ఇటూ చూస్తున్నాడు. క్రిందికి జార్చిన కాళ్లను అటూ ఇటూ ఊపుకుంటూ కూర్చున్నాడు.

రంగరాజు ముఖం గంభీరంగా వుంది. ఆ గంభీరత వెనక కదిపితే కరిగిపోయే ఆందోళన, భయం దాగున్నాయి.

ఆలస్యం అవుతున్నకొలదీ ఏదో టెన్షన్...

డాక్టర్లు అప్పటికో అర్ధగంటముందు చేసిన 'ఈకో' రిపోర్టు కోసం ఆత్రంగా వుంది నా మనసు.

అదే ఆఖరుది. అదిప్పుడు వస్తుంది. అందులో ఏ సంగతీ తెలుస్తుంది.

వాసు జీవితం గురించిన పూర్తి ఇన్ఫర్మేషన్ అందించే పరీక్ష అది. అంటే నా దృష్టిలో ఈకో టెస్టులో వాసుకి ఏం చెయ్యాలా అనేది తెలియవచ్చును.

కన్నకొడుకు కోసం ఓ తండ్రిగా తన సమస్తం ధారవోస్తున్న రంగరాజు మద్రాస్ వచ్చిన దగ్గర్నుంచి డబ్బుకోసం ఎందులోనూ వెనుకాడలేదు. ఎంత డబ్బుతో మద్రాస్‌లో

## పిల్లల్ని రక్షించుకోండి



"పొంగు"వంటి అంటు వ్యాధులు రెండు సంవత్సరాలులోపు పిల్లలకు ఎక్కువగా సోకుతాయి. అక్టోబర్ నుండి నెమ్మదిగా పెరుగుతూ మార్చి, మే నెలల మధ్యలో చాలా ఎక్కువగా ఈ వ్యాధి పిల్లలకు సోకుతుంది. మళ్లీ జూన్‌లో వర్షాలు మొదలుకాగానే తగ్గిపోతాయి. పొంగువంట వ్యాధులు రాకుండా పిల్లలకు "టీకాలు" వేయించటం అత్యవసరం.
ఒకవేళ అలా వేయించకపోతే అనారోగ్యంతో పిల్లలు బాధపడటమేగాక కొన్ని సందర్భాలలో గుడ్డివారు కూడా కావచ్చునని హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార పరిశోధనాసంస్థ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇంటిచుట్టూ ఉండే అపరిశుభ్ర వాతావరణంవల్ల ఈ వ్యాధులు సోకుతాయి. అందువల్ల పిల్లలు ఉన్నవారంతా ఈ విషయంలో ముందు జాగ్రత్తలు తీసికొంటె మంచిది.

—జూపిటర్

అడుగుపెట్టాడో అసలే తెలీదు నాకు.

ఒక్క విషయం మాత్రం నిజం. వాసుకు ఆపరేషనంటూ చేయాలని డాక్టర్లు నిర్ణయిస్తే ఎన్నివేల రూపాయలైనా ఖర్చుచేయడానికి రంగరాజు సిద్ధంగా వున్నాడు.

సరిగ్గా ఇదే సమయంలో...

ఆ గదిలోపల 'స్టెరిలైజ్డ్ డోర్స్' తెరుచుకున్నాయి.

ఆత్రంగా అటుచూసేం నేనూ రంగరాజున్నూ.

'ఈకో' రిపోర్టు చేత్తో పట్టుకుని బయటకొస్తున్నారు డాక్టర్లు.

రంగరాజు ముఖంలో నీడలు వ్యాపించేయి.

ఎందుకో అప్రయత్నంగా చూసేను.

రాహువు మింగబోతున్న చంద్రుడిలా కన్పించాడు వాసు.

* * *

మదరాస్ సెంట్రల్ స్టేషన్‌లో ఉదయం ఆరు గంటలవేళ... రంగరాజూ, నేనూ, వాసూ ప్లాట్‌ఫాంమీదమున్న సిమెంట్ బెంచి మీద కూర్చుని వున్నాం.

రంగరాజు దృష్టి రైలుపట్టాలపైనే ఉంది. మనస్సు మాత్రం ఏదో ఆలోచిస్తున్నట్లుగా వుంది.

తెలిసిన నిజం... అయినా భరించడానికి సిద్ధంగా లేదు రంగరాజు.

ముక్కుపచ్చలారని ఆ పసివాడు ఇంకెన్నాళ్లో బ్రతకడన్న పచ్చినిజం రంగరాజుకు నేనే చెప్పాల్సి వస్తుందని నేనూ అనుకోలేదు. కాని అతన్తోపాటు, అతని ప్రార్థన మీద, మద్రాస్ వచ్చి నాకు డాక్టరు చెప్పిన నిజాన్ని ఆ కన్నతండ్రికి చెప్పకపోతే నేను ద్రోహం చేసినట్లే. అందుకే రంగరాజుతో ఆ విషయాన్ని చాలా నెమ్మదిగా, తొట్రుపాటు లేకుండా... చెప్పేను...

రంగరాజు దుఃఖంతో గుండెలు బాదుకోలేదు. వినకూడని మాట విని 'స్పృహ' తప్పిపోనూలేదు.

నిరాశగా చూసేడు నావంక...

"అవును రంగరాజుగారూ!!!... నిజం... ఆపోజిట్ బ్లడ్ షంట్. (Opposite Blood shunt) ఆపరేషన్ కుదర్దు. చేసినా ఫలితం దక్కకపోవచ్చు. బ్రతికినన్నాళ్లు, కుర్రాడు కోరుకున్నది కొనివ్వడం, అతని ముద్దు తీర్చడం నీవిధి. డాక్టర్లు రిపోర్టుకూడా అదే..."

ఎంతో బాధనూ, ఆందోళననూ అణచిపెట్టుకుని నేనైతే అన్నానుగాని... మొదట వున్న బాధ రంగరాజులో ఇప్పుడు కన్పించలేదు.

రంగరాజు ప్రవర్తనకూడా అయోమయంగా కన్పిస్తోంది. ఉందుండి ఒక్కసారే అరిచేడు రంగరాజు.

"ఎన్నివేలు ఖర్చయినా సరే, వాసుకు ఆపరేషన్ చేయించే తీరతాను..."

ఉలిక్కిపడి చూసేను రంగరాజువేపు.

"వాసుకు ఆపరేషన్ చేయించాలని నేను పడిన పాట్లు అందుకు డబ్బు సంపాదించుకోవడంలో నేను పడిన శ్రమ నీకు తెలీదు బాబూ!! ఆపరేషన్

చెయ్యాలని వైజాగ్‌లోని డాక్టర్లు చెప్పి, ముప్పై వేలు ఖర్చవుతుందన్నారు... అప్పటికే నాకున్న లోనులన్నీ తీసేసేను. చేతిలో చిల్లిగవ్వలేదు. మరైతే వేనేం చేసేవో తెల్సునా బాబూ!? డిపార్ట్‌మెంట్‌లో అందర్నీ అడిగేను. వెళ్తేరువాళ్లను ప్రార్థించేను. అందరూ కలిసి ఇచ్చింది ముప్పైవేలువచ్చింది...'' క్షణకాలం చెప్పడం ఆపి నావంక చూసి మళ్లీ చెప్పసాగాడు రంగరాజు.

''ఇప్పటికే ఆ డబ్బులో సుమారుగా పదివేల రూపాయలు పరీక్షలకనీ, దానికనీ, దీనికనీ ఖర్చు అయింది. మిగిలిందో ఇరవై వేల రూపాయలు. అది పట్టుకుని మదరాస్‌లో అడుగుపెట్టేను. ఇప్పుడుగాని, వాసుకు ఆపరేషన్ జరక్కపోతే?!!!!...

ఇక మాట్లాడలేకపోయాడు రంగరాజు.

అంతవరకూ రంగరాజు దృష్టి నిలిపిన రైలుపట్టాలమీద ట్రయినేదో వచ్చి ఆగింది. జనం పెట్టెల దగ్గరకి పరిగెడుతుంటే అటు వేపు చూస్తున్నాడు వాసు.

మేం అనుకుంటున్న మాటలేవీ వాసు వినడంలేదు. ఆ పసివాడి దృష్టి మరోచోట ఉంది.

... ... ...

''మరైతే ఇప్పుడేం చెయ్యాలని నిర్ణయించుకున్నారు?''

అదుర్దాగా ప్రశ్నించాను రంగరాజును.

''ఏం చేస్తాను?... వాసు అదృష్టానికి మరో పరీక్ష. ఇక్కడికి దగ్గరేగా రాయవెల్లూరు. అక్కడికి తీసుకువెళ్తాను. అక్కడి డాక్టర్ల కాళ్లు పట్టుకునైనా సరే, వాసుకు ఆపరేషన్ చేయిస్తాను''

స్థిరంగా పలికింది రంగరాజు గొంతు.

పరిస్థితి పూర్తిగా అర్థమైంది నాకు.

''ఒకవేళ రాయవెల్లూరులోని డాక్టర్లు కూడా ఆపరేషన్‌చెయలేకపోతేనో??''

నా ప్రశ్న పూర్తిగా లేదు. రంగరాజు గభాల్న కూర్చున్న చోటునుంచి లేచి నించున్నాడు.

''వాసు జీవితం ఏమయినా సరే... వాడి ఆపరేషన్ కోసం డబ్బు సర్దినవాళ్లందరికీ, నా ముఖాన్ని తిరిగి చూపించాలి.

అంటే వాసును ఆపరేషన్ బల్ల ఎక్కించడమే తప్ప, మరో గత్యంతరం లేదుబాబూ!... చివరకు... ఆపరేషన్‌లో వాసు చనిపోయినా సరే...''

ఠక్కున అన్నాడు రంగరాజు.

కన్నకొడుకు ప్రాణాలు ముందా!... చందాలిచ్చిన వాళ్లముందు పరువూ, మర్యాదా ముందా? అన్న ప్రశ్నకు శాశ్వతమైన జవాబు తట్టిందా సమయంలో.

''అసలు వాళ్లు ఆపరేషన్ చెయ్యకుండా తిరిగి వెళ్లిపొమ్మని చెప్పేస్తేనో??'' ఇంకా చావని ఆశ ఏదో నాలో మొలకెత్తగా అడిగేను రంగరాజును.

అప్పటికే రంగరాజు కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. చటుక్కున నావేపు చూసేడు.

''ఈ రంగరాజు ప్రాణాలతో జీవించి వుండడు!!''

నాకంట్లో ఏదో వణుకు పడింది సరిగ్గా అప్పుడే...

❋